క్లుప్తంగా

'దేవాలయాలపై దాడులు సరికాదు'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఇటీవల వరుసగా హిందూ దేవాలయాలపై దాడులు చేయడం సరికాదని బీజేపీ నాయకులు గుగ్లావత్ శ్రీరాంనాయక్, అడ్వకేట్ జగన్‌లు అన్నారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. దాడి చేసిన వారిని ప్రభుత్వం శిక్షించకుండా రక్షిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండేరి రమేశ్, లింగాగౌడ్, రాజశేఖర్, సత్తన్న, రవి, సతీశ్, వెంకటేశ్, రాజేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



గాలికుంటు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె)లో బుధవారం పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఏటా పశువులకు ముందస్తు గాలికుంటు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పశువైద్యశాఖ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాంబాబు

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం 45 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంజాల ఉప కేంద్రం పరిధిలోని మొత్తం 15 గ్రామాల నుంచి గర్భిణులను ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామస్థాయిలో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్‌వో సుశీల, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ నగేశ్

ఆదిలాబాద్: శ్రీసంత్ సద్గురు నారాయణ బాబా 18వ పుణ్యతిథి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ బుధవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ బాబా 18వ పుణ్యతిథి కార్యక్రమం ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. తలమడుగు మండలంలోని పల్సి(బి) తండా గ్రామంలో కిషన్ దాదా అధ్యక్షతన ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జాదవ్ కిషన్, కినక సురేశ్, గెడం దీపక్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత

నేరడిగొండ: మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత అని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. మండలంలోని జాతీయ రహదారికి ఇరుపైపులా నాటిన మొక్కలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ద్వారా ప్రతిరోజు మొక్కలకు నీరు పోయాలన్నారు. చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. చెట్లను నరకడంతో కాలుష్యం పెరగడంతో పాటు అటవీ అంతరించి పోతుందన్నారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నిజాయతీ చాటుకున్న మాజీ సర్పంచ్

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో ఇంద్రవెల్లి మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్‌కు సెల్‌ఫోన్ దొరికింది. దొరికిన సెల్‌ఫోన్‌ను బుధవారం బాధితులకు అందించి నిజాయతీ చాటుకున్నాడు. ఈసందర్భంగా కొరెంగా సుంకట్‌రావ్ మాట్లాడుతూ.. గుడిహత్నూర్ మండలంలోని మాన్కపూర్ గ్రామానికి చెందిన కోవా రాధాబాయిగా గుర్తించి వారిగా అందించినట్లు తెలిపారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



ఎంఈవోకు రిపోర్టు చేస్తున్న ఉపాధ్యాయురాలు

బేల: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ఎంఈవో కోల నర్సింహులుకు ఇటీవల డీఎస్సీలో ఎంపికైన తెలుగు, మరాఠీ మీడియం తాలుకు 28 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు నియామక పత్రాలను అందజేశారు. దీంతో పాటు సంబంధిత మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరారు. ఇతర మండలాల నుంచి ఇక్కడికి మరో 8 మంది ఉపాధ్యాయులు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. కార్యక్రమంలో సీఆర్పీ వెంకన్న, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్, టి. నరసింహా స్వామి, మానుస్మారే అతుల్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో కొలువులు సాధించిన కొత్త ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. మండల విద్యాధికారి భూమారెడ్డికి రిపోర్టు చేశారు. కొత్తగా మండలానికి 18 మంది టీచర్లు నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు.

నార్నూర్: గత కొన్ని ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు ఎట్టకేలకు భర్తీ అయ్యాయి. గాదిగూడ మండలంలో ఇప్పటి వరకు 12 పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో మూతపడి ఉన్నాయి. ప్రభుత్వం డీఎస్సీ ద్వారా కొత్త ఉపాధ్యాయుల నియామకాలు చెపట్టడంతో గాదిగూడ మండలానికి 12 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయి. కొత్తగా ఉద్యోగం సాధించిన వారు ఎంఈవో మనోహర్‌కు రిపోర్టు చేశారు. నార్నూరు మండలంలో మొత్తం ఐదుగురు కొత్త ఉపాధ్యాయులు బుధవారం ఎంఈవో పవార్ అనిత రిపోర్ట్ చేయడంతో ఉపాధ్యాయుల కొరత తీరింది.



ఎంఈవోకు రిపోర్టు చేస్తున్న ఉపాధ్యాయులు



రిపోర్ట్ చేస్తున్న కొత్త ఉపాధ్యాయులు



గాదిగూడలో..

దళారులకు అమ్మి మోసపోవద్దు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను దళారులకు అమ్మి రైతులు మోసపోవద్దని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం సోయా క్వింటాలుకు మద్దతు ధర రూ. 4892 ప్రకటించిందని తెలిపారు. రైతులు సోయా పంటను కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు ఇబ్బంది తలెత్తకుండా అధికారులు భోజనం, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ అధికారులతో పాటు ఆ సంఘం చైర్మన్ సాబ్లే కిషోర్ సింగ్, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, కలాలి వెంకట రమణ, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఆడే వసంత్‌రావు, అల్లూరి శివారెడ్డి, పసుల చంటి, సాబ్లే నానక్ సింగ్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటా

ఇచ్చోడ: బాధితులకు అండగా ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన శేక్ నాజమీన్ కుటుంబానికి బుధవారం సాయంత్రం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. లక్ష 42 వేల చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బోరిగామ మాజీ సర్పంచ్ కుంట అరుంధతి సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను తొలగించాలి



మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: గ్రామాల్లో ఉన్న బెల్ట్‌షాపులను వెంటనే తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాజకీయ నాయకుల ప్రోద్బలం, అధికారుల అండదండలతో బెల్ట్ షాపుల యజమానులు కల్తీ మద్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు. బెల్ట్ షాపులను అరికట్టాలని, వాటికి మద్యం అందిస్తున్న వైన్ షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, అరుణ్ కుమార్, కాంబ్లే రాందాస్, షేక్ పాషా, బెజ్జంకి నర్సింగరావు, బత్తుల రామన్న, తాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణతో మెలగాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో 32 బెటాలియన్ పది రోజుల ఇనిస్టిట్యూషనల్ ఎన్‌సీసీ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి శిక్షణ పొందాలని సూచించారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ పొందడంతో అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సిబ్బంది సుజీత్ సింగ్, నరేశ్‌కుమార్, కేర్‌టేకర్ చంద్రకాంత్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల డిమాండ్లు నెరవేర్చాలి



నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఇంద్రవెల్లి: తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో అదిలాబాద్ నుంచి ప్రారంభించిన పాదయాత్ర బుధవారం ఇంద్రవెల్లి మండల కేంద్రం మీదుగా కొనసాగింది. ముందుగా అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యమ ఆకాంక్షలు అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ఉద్యమకారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలం , ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సామల ప్రశాంత్, సుజాత్‌అలీ, సత్యమ్మ, భారతి, పెందోర్ ధర్ము, గేడం విఠల్, మారుతి, బాసం రవి, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'



మాట్లాడుతున్న మాల సంఘం నాయకులు

నేరడిగొండ: పలు సంఘాల నాయకులు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మండలం మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నక్క మహేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మాల ఆత్మీయ సమ్మేళనంలో మాలల ఐక్యతకు పిలుపునిచ్చారని తెలిపారు. ఈ విషయంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా చేయాలని డిమాండ్ చేశారు.

బోథ్: ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిపై ఎమ్మార్పీఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మాల సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. మాల జాతీ ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన ఎమ్మెల్యే వివేక్ మాలల ఐక్యతకు పిలుపునిచ్చారని అన్నారు. మాలల జనాభా లెక్కించిన తరువాతనే వర్గీకరణ చేపట్టాలన్నారు. నాయకులు ఎలుక రాజు సోమన్న, సురేందర్, ఉషన్న పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై కొంతమంది అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సంతపురి రాజేశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాలల ఐక్యతకు పిలుపునిచ్చారని తెలిపారు. కొంత మంది కావాలనే చెన్నూర్ వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్, ఎముల కిరణ్, దినేష్, కోడి రమేశ్, ఉషన్న, కారం రాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకంతో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు మూసివేసే పరిస్థితి తలెత్తిందని జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు ఆరోపించారు. ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న ఆర్టీఎఫ్ బకాయిలను చెల్లించాలని నినాదాలు చేస్తూ.. ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

నర్సరీల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: రానున్న 2024–25 సంవత్సరానికి నర్సరీల ఏర్పాటు కోసం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది కలిసి మాట్లాడారు. ప్రతీ పంచాయతీ పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కల పెంచాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు కసరత్తు చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ కమిటీల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏటీడీవో అమిత్‌కుమార్

ఇచ్చోడ: గిరిజన పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక కృషి చేయాలని ఇచ్చోడ ఏటీడీవో అమిత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మేడిగూడ, గాయిద్‌పల్లి ప్రాథమిక పాఠశాలలతో పాటుగా మేడిగూడ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. గిరిజన విద్య అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు ప్రతీరోజు పాఠశాలకు రావాలన్నారు. ఆయన వెంట మేడిగూడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, తదితరులు ఉన్నారు.

'సీఎంపై కేసు నమోదు చేయాలి'



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: మోసపూరిత హామీలిచ్చిన సీఎం రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేయడాన్ని మానుకోవాలన్నారు. మూసి నదీ ప్రాజెక్ట్‌లో భారీ స్కామ్ చోటుచేసుకుందని ఆరోపించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈనెల 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని డీఎస్పీకి ఫిర్యాదు చేశామని, ఇప్పటికీ కేసు నమోదు చేయలేదని మండిపడ్డారు. కేటీఆర్ ఆరోపణలు చేస్తే వెంటనే కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్, అజయ్, ఇజ్జగిరి నారాయణ, యాసం నర్సింగ్‌రావు, గోవర్ధన్, రాజు, పరమేశ్వర్, అశోక్, పురుషోత్తం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంద్రాదేవి ఆలయంలో పూజలు



మొక్కుతున్న రాఘపూర్ ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీల దసరా పూజలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీలు తరలి వచ్చి ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం మండలంతో పాటు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్, రాఘపూర్ గ్రామాల నుంచి ఆదివాసీలు తరలివచ్చారు. నైవేద్యం సమర్పించి మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ మహరాజ్ చహకటి సూర్యరావ్, భక్తులు లక్ష్మణ్, చిక్రం విఠల్, చహకటి రాజు, జంగు, మాన్కు పాల్గొన్నారు.

హీరాసుక్క మందిరం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఆదివాసీ పెద్దలు

నార్నూర్: ఆదివాసీల ఆరాధ్య దైవం హీరా సుక్క మందిర నిర్మాణానికి బుధవారం గాది గూడ మండల కేంద్రంలో ఆదివాసీ పెద్దలు, మాజీ ఎంపీపీ ఆడ చంద్రకళ రాజేశ్వర్‌లు భూ మిపూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్దల సహకారంతో వచ్చే ఏడాది వ రకు మందిర నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు కృసి చేస్తామన్నారు. జాతి కోసం పనిచేసిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చే యడం, మందిరాలు నిర్మించి, వారిని స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు హెరాకుంరం పాండురంగ్, ఆత్రం వామన్, పరుశురాం గేడం, సిడం వామన్, తొడసం శ్యామ రావు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వంతెన నిర్మాణం కోసం రూ. 3 కోట్ల 30 లక్షలు మంజూరు చేసింది. నిధులు మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు. కాగా నిధుల మంజూరు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ద్వారానే జరిగిందని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొనగా, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ వల్లే ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

తాంసి: గ్రామాల్లో మంచినీటి సహాయకులకు మిషన్ భగీరథ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్ మండల అధికారులతో కలిసి ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, పంచాయతీ కార్మికులకు శిక్షణ ఇచ్చారు. తాగునీటి సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీవో లింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వం నమోదు

తలమడుగు: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల అధ్యక్షుడు బోనగిరి స్వామి, బీజేవైఎం అధ్యక్షుడు దాతాజీ కిరణ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి దేవన్న, ఉపాధ్యక్షుడు నక్క ధనుంజయ్, మనోహర్ రెడ్డి, ప్రేమేందర్ రెడ్డి, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి జాతీయ శిక్షణ మేళాను ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే అభ్యర్థులు a ppre ntic-erhi p.gov.in వెబ్‌సైట్‌లో పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఐటీఐ ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రం, పదో తరగతి, కుల ధ్రువీకరణ పత్రంతో పాటు పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలతో హాజరు కావాలన్నారు. టీఎస్ ఆర్టీసీ, అష్టలక్ష్మి స్పిన్నింగ్ మిల్, ఐటీసీ ఫుడ్స్, ఇతర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9491460060 సంప్రదించాలని కోరారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

కైలాస్‌నగర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు బుధవారం నిరసన చేపట్టారు. పట్టణంలోని వివిధ దుకాణాల్లో పనిచేసే కార్మికులు తమ విధులను బహిష్కరించారు. స్థానిక మర్వాడి ధర్మశాల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అక్కడి ప్రధాన ద్వారం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామల దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్



వంటకాలు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

ఉట్నూర్‌రూరల్: ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైఫ్ సైన్స్, ఎస్‌ఎస్‌ఎస్ వారి ఆధ్వర్యంలో పోషక విలువలతో కూడిన శాఖహార వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, అధ్యాపకులు, విద్యార్థులు సాంప్రదాయ వంటకాలను రుచి చూశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సాయి ప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ నర్సింగ్‌రావు, లైబ్రేరియన్ చంద్రశేఖర్, అధ్యాపకులు ముజీబ్, రాజశేఖర్, రవీందర్ పాల్గొన్నారు.

30 మందిపై అట్రాసిటీ కేసు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె)లో జరిగిన ఘటనలో 30 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మంగళవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన దాడి ఘటనలో తల్వారే తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరో వర్గానికి చెందిన వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.